
సాక్షి
నిర్మల్
సోమవారం ၊ 4 ၊ సెప్టెంబర్ ၊ 2023



కొలామి భాషకు అక్షర సేద్యం

ఆదివాసీ కొలాం యువత ముందడుగేసింది. కొలామి భాష, సంస్కృతీసంప్రదాయాలను భావితరాలకు అందించాలని నిర్ణయించి వికీపీడియాను వేదికగా ఎంచుకుంది. 8లో▸



కబ్జాలో ప్రభుత్వ స్థలాలు

కుభీర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలను కొందరు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తంజేస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /25.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల తనిఖీ



కొండుకూర్‌లో జాబితా పరిశీలిస్తున్న కలెక్టర్

కడెం: మండలంలోని కడెం, ధర్మాజీపేట్, కొండుకూర్ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. ఓటరు జాబితాలో సవరణలు, నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ, కేంద్రాల్లోని వసతులు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రాజేశ్వరి, డీటీ చిన్నయ్య, సర్పంచులు గొల్ల వేణుగోపాల్, ఒర్సు వెంకటేశ్, అనూష తదితరులున్నారు.
మామడ: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో రత్నకళ్యాణి పరిశీలించారు. బీఎల్వోలు ఓటరు జాబితాను కేంద్రంలో ప్రదర్శించాలని తెలిపారు. మార్పులు, చేర్పులుంటే గమనించాలని పేర్కొన్నారు. జాబితాలో పేర్లు చూసుకునే వారి సందేహాలు నివృత్తి చేయాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, సిబ్బంది ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి



రక్షాబంధన్‌లో పాల్గొన్న కాలనీవాసులు

భైంసాటౌన్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం అందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. భైంసా పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో నైజాం విముక్త అమృతోత్సవాల్లో భాగంగా ఆదివారం రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. వక్త శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాఖీ పండుగకు పురాణ కాలం నుంచి ప్రాముఖ్యత ఉందని, దేవతలు, రాక్షసులకు యుద్ధం జరిగినప్పుడు సచిదేవి ఇంద్రుడికి రాఖీ కట్టి యుద్ధానికి పంపినట్లు ఇతిహాసాల్లో ఉందన్నారు. ప్రపంచం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు పాటిస్తోందని, త్వరలోనే భారత్ విశ్వగురు స్థానంలో నిలుస్తుందని చెప్పారు. నైజాం విముక్త నరసింహనగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు మెంచు గంగయ్య, కార్యదర్శి చిలుక గణేశ్, సాదుల కృష్ణదాస్, సభ్యులు హన్మాండ్లు, భూషణ్, లక్ష్మణ్, జైమారుతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందులో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడలు మానసిక వికాసానికి తోడ్పడుతాయని పేర్కొన్నారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న పిల్లలను విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ నెల 9, 10తేదీల్లో జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి మోహన్, సెక్రటరీ రమణారావు, సలహాదారు జమున, వ్యాయామ ఉపాధ్యాయుడు వీ భూమన్న, ఆర్గనైజ్ సెక్రటరీ గంగాధర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి



రాస్తారోకో చేస్తున్న బోల్సా గ్రామస్తులు

తానూరు: అర్హులకు దళితబంధు, బీసీ కులవృత్తులవారికి ఆర్థికసాయం అందించాలని ఆదివారం మండలంలోని బోల్సా గ్రామస్తులు భైంసా-తానూరు రాహదారిపై రాస్తారోకో చేశారు. వారు మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు కమీషన్లు దండుకుంటూ అనర్హులకు పథకాలు వర్తింపజేస్తున్నారని ఆరోపించారు. దళితబస్తీ అమలులోనూ దళారీ వ్యవస్థ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి అర్హులకు ప్రభుత్వం పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలని డిమాండ్ చేశారు. ఎస్సై సందీప్ ఆందోళనకారులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు జవారే భీంరావ్ తదితరులున్నారు.

పక్కాగా పంటల లెక్క..!

- జిల్లాలో కొనసాగుతున్న సాగు సర్వే
- ఇక పంటల వివరాలు ఆన్‌లైన్‌లో..
- క్రాప్ బుకింగ్‌లో సరికొత్త విధానం
- క్షేత్రస్థాయికి వెళ్తేనే నమోదుకు ఛాన్స్
- పొలంబాట పడుతున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్/లోకేశ్వరం: పంట కోత సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం సాగు వివరాల నమోదుకు శ్రీకారం చుట్టింది. కేటాయించిన క్లస్టర్లలో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వ్యవసాయ విస్తరణాధికారులను ఆదేశించింది. దీంతో వారు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట, రైతు ఫొటో, సర్వేనంబర్, సాగు విస్తీర్ణం తదితర వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. గతంలో వివరాలు నమోదు చేయకపోవడంతో వివిధ కారణాలతో పంటనష్టం జరిగినప్పుడు రైతులు నష్టాలు చవిచూశారు. ఇప్పుడా పరిస్థితి రాకుండా ఉండేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

గతంలో ఇలా..

గ్రామానికి వెళ్లిన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) ఆయా సర్వేనంబర్లలో రైతులు ఏయే పంటలు సాగు చేశారో నమోదు చేసి వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉండేది. అయితే.. ఏఈవో పంటల వద్దకు వెళ్లి కనుచూపు మేర ఒకటే పంట కనిపిస్తే రైతులు అదే పంట ఎక్కువ విస్తీర్ణంలో పండించారని నామమాత్రంగా నమోదు చేసేవారు. దీంతో సాగు వివరాలు స్పష్టంగా తెలిసేది కాదు. తద్వారా ప్రభుత్వానికి ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగయ్యాయనే విషయంలో స్పష్టత కొరవడేది.

క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే..

ప్రభుత్వం యాప్‌లో కొత్త మాడ్యుల్ తీసుకువచ్చింది. ఇందులో తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్తేనే ఈ వివరాలు నమోదు చేసుకునే విధంగా ఉండడంతో ఏఈవోలు పొలంబాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం జిల్లాలోనే కాకుండా రాష్ట్రం మొత్తంగా ఈవిధానంపై ట్రయల్ రన్ కొనసాగుతోంది. ఇందులో ఎదురయ్యే లోటుపాట్లు సవరించుకున్న తర్వాతే త్వరలో దీన్ని అమలు చేయనున్నారు.



లోకేశ్వరంలో సర్వే నిర్వహిస్తున్న ఏఈవో మౌనిక (ఫైల్)

ధాన్యం విక్రయించే సమయంలో..

పంటల నమోదుతో రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించే సమయంలో ఇబ్బందులు ఉండవని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతు తన పంటను ఎప్పుడు విక్రయించాలన్నా సమాచారం కూడా అందించే సౌకర్యం ఉండటంతోపాటు ఏయే గ్రామాల నుంచి ఎంత దిగుబడి వస్తుందనే విషయాన్ని మార్కెటింగ్ అధికారులకు ముందస్తుగానే తెలియజేయడంతో కొనుగోళ్లు, అమ్మకాలు సులభతరం కానున్నాయి. ప్రస్తుతం వ్యవసాయాధికారులు ఇచ్చిన టోకెన్ ప్రకారం రైతులు వారు పండించిన ధాన్యాన్ని విక్రయించి లబ్ధిపొందుతున్న పరిస్థితులున్నాయి.

కొత్త విధానం ఇలా..

జిల్లాలో 79 క్లస్టర్లకు ఏఈవోలున్నారు. ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున ఉండగా, కొన్నింటిలో అంతకుమించి, కొన్నింటిలో తక్కువ కూడా ఉన్నాయి. కొత్త యాప్‌లో సర్వే నంబర్లన్నీ ఎరుపు రంగులో కనిపిస్తాయి. ఏఈవోలు ఒక సర్వే నంబర్‌కు వెళ్లినప్పుడు అందులో మూడు పట్టాభూములు ఉంటే రెండు పట్టా భూముల వివరాలు నమోదు చేసిన పక్షంలో ఆ సర్వే నంబర్ రంగు ఎరుపు నుంచి పసుపు రంగుకు మారుతుంది. ఒక వేళ వందశాతం ఆ సర్వే నంబర్‌లో క్రాప్ బుకింగ్ పూర్తయితే ఆకుపచ్చ రంగులోకి మారిపోతుంది. తద్వారా అక్కడ పంట నమోదు పూర్తిస్థాయిలో జరిగిందని అర్థం. ఇలా కొత్త విధానం ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉంది.



లోకేశ్వరంలో పంటల సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

అధికారులకు చెబుతున్నం



వానాకాలంలో సాగు చేసిన పంటల వివరాలు వ్యవసాయాధికారులకు చెబుతున్నం. వారు పంటల వద్దకు వచ్చి సాగు విస్తీర్ణం, సర్వే నంబర్, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ లాంటి వివరాలు తీసుకుంటున్నరు. పంట విక్రయించేటప్పుడు ఇబ్బంది రాకుండా చూడాలె.
– జెబన్న, ధర్మోర, లోకేశ్వరం మండలం

సర్వే నంబర్ల ఆధారంగానే..



రైతుల పట్టాదారు పాసుపుస్తకాల సర్వే నంబర్ ఆధారంగా పంటల సాగు సర్వే ప్రక్రియ చేపట్టాం. వ్యవసాయ విస్తరణాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పంటలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో పంట చేతికొచ్చాక ఇబ్బంది లేకుండా విక్రయించుకోవచ్చు.
– గణేశ్, ఏవో, లోకేశ్వరం

పొలాలకు వెళ్తేనే వివరాలు..

యాక్టివ్ లాగర్ యాప్ ఇదివరకు ఏఈవోలు ట్యాబ్‌లలో ఉపయోగిస్తున్నదే. దీంట్లోనే వారు హాజరుతోపాటు రోజువారీ విధులకు సంబంధించి రైతు బీమా, రైతుబంధు అప్డేట్ నమోదు చేసి పంపించేవారు. ఇందులోనే క్రాప్ బుకింగ్ కూడా చేపట్టేవారు. అయితే.. ఇది క్షేత్రస్థాయి వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఏఈవోలు వివరాలు నమోదు చేసేలా ఉంది. ఈక్రమంలో ఇందులో కొన్ని మార్పులు చేస్తూ ప్రభుత్వం తప్పనిసరిగా ఆ సర్వే నంబర్ వరకు వెళ్లినప్పుడు మాత్రమే వివరాలు కనిపించేలా రూపొందించింది. ఉదాహరణకు.. ఒక ఏఈవో ఒక సర్వే నంబర్‌కు వెళ్లాల్సి వచ్చినప్పుడు గూగుల్‌లో జియో ఫెన్స్ ద్వారా ఆ లోకేషన్‌కు చేరుకోవచ్చు. 50 మీటర్ల దూరంలో ఉన్నప్పుడు ఆ సర్వే నంబర్ వివరాలు ట్యాబ్‌లోని యాప్‌లో కనిపిస్తాయి. అప్పుడే పంట వివరాలు నమోదు చేయవచ్చు.

స్థానిక పోలీసులపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల నిర్మల్‌లో జరిగిన మాస్టర్ ప్లాన్ ఉద్యమంలో స్థానిక పోలీసులు జరిపిన లాఠీ చార్జి విషయంపై కేంద్ర హోంమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ సీనియర్ నాయకులు ఆదివారం కలిశారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్ నియోజకవర్గంలో ఓటరు జాబితాలో అనేక తప్పిదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, ఒకే ఇంటి నంబర్‌పై ఇతర ప్రాంతాల వ్యక్తుల పేర్లు, బోగస్ ఓట్లు నమోదు చేయించారని ఆరోపించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి బోగస్ ఓట్లు తొలగించాలని కోరారు. స్పందించిన మంత్రి కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసినవారిలో నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, అంజుకుమార్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, సాదం అరవింద్, సామ రాజేశ్వర్‌రెడ్డి, రాజు, అలివేలు మంగ, విలాస్, హరీశ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, గంగన్న, భూపతిరెడ్డి, గంగారెడ్డి, భాస్కర్, నరేశ్ ఉన్నారు.

గొడుగుల పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: ఐకేఆర్ ఫౌండేషన్ ట్రస్ట్ అధ్యక్షుడు అల్లోల గౌతంరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలోని చిరువ్యాపారులకు రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆదివారం వెయ్యి గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ రాజేందర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి



దీక్ష శిబిరంలో కూర్చున్న అమరుల కుటుంబాల సభ్యులు, ఉద్యమకారులు

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణగౌడ్
- జిల్లాకేంద్రంలో శాంతియుత దీక్ష

నిర్మల్: తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన ఉద్యమకారులు, ప్రాణాలనూ త్యాగం చేసిన అమరుల కుటుంబాలను ప్రభుత్వం గుర్తించాలని, వెంటనే ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కమ్ రామకృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శాంతియుత దీక్ష నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారులతోపాటు అమరుల ఫొటోలు పట్టుకుని వారి కుటుంబసభ్యులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ, నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షుడు సామ కిరణ్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. తెలంగాణ కోసం 1969 నుంచి 2014వరకు ఉద్యమంలో ముందున్నామని గుర్తు చేశారు. పోలీస్ కేసుల్లో చిక్కుకొని, జైలు జీవితం అనుభవించిన వారిని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అన్ని పార్టీలూ తమ మేనిఫెస్టోలో ఈ విషయాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు.

అమరుల కుటుంబాలకు..


తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఇప్పటివరకు న్యాయం జరగలేదని ఫోరం నాయకులు తెలిపారు. మిగతా అమరవీరుల కుటుంబాలను గుర్తించాలని, వారికీ రూ.10లక్షలు, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లోనూ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలకు కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వివిధ పార్టీలు, సంఘాల మద్దతు..

తెలంగాణ ఉద్యమకారుల దీక్షకు పలు సంఘాలు, పార్టీలు మద్దతు ప్రకటించాయి. దీక్షలో సామ కిరణ్‌రెడ్డి, ఉద్యమకవి జాదవ్ పుండలిక్‌రావు పాటిల్, నాగనాథ్, రాజేశ్వర్, ఎం.సాయినాథ్, ఎస్.హరీశ్, కే సిరాజ్, రాధమ్మ, రంజిత్, చంద్రకళ, రమేశ్, సాదు రాంరెడ్డి, యాటకారి సాయన్న, గోపి గంగన్న, ఎం.శంకర్, భూమన్న, రామలక్ష్మణ్, వీరాచారి, ఏ భాస్కర్, పీ శంకర్, డీ గంగాధర్, కే శ్రీనివాస్, పీ యువరాజ్, డాక్టర్ జగన్, సామల కిరణ్‌రెడ్డి, పోర్పల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. దీక్షను బీజేపీ సీనియర్ నేత రావుల రాంనాథ్ ప్రారంభించగా, తెలంగాణ గౌడ సంఘం జిల్లా కార్యదర్శి గోపి గౌడ్ దీక్షాపరులకు పూలమాలలు వేశారు. కౌన్సిలర్ ప్రసాద్, బీఎస్పీ నాయకుడు జగన్మోహన్ తదితరులు ఉద్యమకారుల దీక్ష విరమింపజేశారు.

బీజేపీ 'అప్లికేషన్స్'

- నేటి నుంచి స్వీకరణ
- జిల్లాలో భారీగా ఆశావహులు



నిర్మల్: కమలం కూడా కాంగ్రెస్ బాటలో అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తోంది. తమ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకునే ఆశావహులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ నెల 4నుంచి 10వ తేదీవరకు హైదరాబాద్ నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి రెండురోజుల క్రితం ప్రకటించారు. ఇప్పటికే కాంగ్రెస్ ఈ తరహాలో అప్లికేషన్లు స్వీకరించింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియనూ ఓ కొలిక్కి తీసుకువస్తోంది. అధికార బీఆర్ఎస్ ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించేసింది. జిల్లాలో నిర్మల్ మినహా ముధోల్, ఖానాపూర్ రెండుచోట్లా పోటాపోటీగా ఆశావహులు ఉండటం ఆసక్తి కలిగిస్తోంది. పార్టీ ఎవరివైపు మొగ్గుచూపుతుందన్న విషయం తేలడం లేదు. తాజాగా దరఖాస్తుల స్వీకరణ చేపడుతుండటంతో మరింతమంది ఆశావహులు పెరిగే అవకాశముంది.

నిర్మల్‌లో ఒక్కరే..!

బీజేపీ గెలుస్తుందని బలంగా నమ్ముతున్న స్థానాల్లో జిల్లాలోని మూడు నియోజకవర్గాలున్నాయి. ఇందులో నిర్మల్‌పైనా పార్టీ భారీ ఆశలు పెట్టుకుంది. ఇక్కడ ఇప్పటికైతే మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఒక్కరే టికెట్ రేసులో ఉన్నారు. ఆయనకే పార్టీ టికెట్ అన్నది అందరికీ తెలిసిన విషయమే. అయినప్పటికీ పార్టీ దరఖాస్తుల స్వీకరణ చేపడుతోంది కనుక నిర్మల్ నుంచి మహేశ్వర్‌రెడ్డితో పాటు ఒకరిద్దరు నేతలు దరఖాస్తు చేసుకునే అవకాశముంది.

ముధోల్ నుంచి ముమ్మరంగా..

ముధోల్ నియోజకవర్గంలో ముందునుంచీ బీజేపీకి కొంత పట్టుంది. వరుసగా రెండు ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడి స్థానిక పరిస్థితులను బట్టి ఈసారి గెలుస్తామన్న ధీమాలో ఉంది. ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కూడా ప్రజాసంగ్రామయాత్ర ఐదోవిడతను ముధోల్‌నుంచే ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, డీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరిన రామారావుపటేల్, నియోజకవర్గ సీనియర్ నేత మోహన్‌రావుపటేల్, ఎన్ఆర్ఐ, యువనేత బాజీరావు పటేల్, బద్ధం భోజారెడ్డి తదితరులు టికెట్ ఆశిస్తున్నారు. వీరంతా ఇప్పటికే ప్రజల్లో ముమ్మరంగా తిరుగుతూ ప్రచారం చేసుకుంటున్నారు. తమకే టికెట్ ఇవ్వాలంటూ అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకోనున్నారు.

ఖానాపూర్‌లో పోటాపోటీ..

ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఖానాపూర్‌లో తొలిసారి బీజేపీ బలంగా కనిపిస్తోంది. ప్రజాసంగ్రామయాత్ర విజయవంతమైన తర్వాత ఇక్కడ మరింత ఆదరణ పెరిగినట్లు పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లోనూ పార్టీ ఇక్కడ గౌరవప్రదమైన ఓట్లు సాధించింది. వీటన్నింటి నేపథ్యంలో పలువురు సీనియర్లు, కొత్త నేతలు బీజేపీ టికెట్ ఆశిస్తున్నారు. ప్రధానంగా మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్, పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు జానకీబాయి, సీనియర్ నేత హరినాయక్, గత ఎన్నికల్లో పోటీచేసిన సట్ల అశోక్‌తో పాటు మరో ఇద్దరుముగ్గురు గిరిజన నేతలు ఇక్కడి నుంచి దరఖాస్తు చేసుకోనున్నారు.

ఏ ప్రాతిపదికన కేటాయిస్తుందో..

కాంగ్రెస్ తరహాలో టికెట్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న బీజేపీ ఏ ప్రాతిపదికన అభ్యర్థులను ఖరారు చేయనుందో వెల్లడించలేదు. నియోజకవర్గంలో బలాబలాలు, ప్రజాస్పందన, పార్టీనేతల రిపోర్టుల ఆధారంగా ఎంపికచేస్తారా... లేక ఇంకా ఏమైనా సర్వే రిపోర్టులు చూస్తారా.. తేల్చలేదు. మరోవైపు దరఖాస్తు చేసుకున్న వారిలో ఒకరికి టికెట్ ఇస్తే.. మిగిలిన ఆశావహులు వారికి సహకరిస్తారా.. అనేదీ సందేహమే. ఇక పోటీ లేని నిర్మల్ లాంటి నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించడం ఏంటన్న ప్రశ్నలూ సొంత పార్టీ నేతల నుంచే రావడం గమనార్హం.

జిల్లాలో పలుచోట్ల వర్షం



జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో రోడ్డుపై నిలిచిన వరదనీరు

- జిల్లా కేంద్రం అతలాకుతలం
- ఆయా మండలాల్లోనూ వాన

నిర్మల్ ఖిల్లా: జిల్లా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి మూడు గంటలపాటు భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ద్విచక్ర వాహనాలు నీట మునిగి కొట్టుకుపోయాయి. డాక్టర్స్‌లేన్‌లోగల తిరుమల థియేటర్ ఎదురుగా డ్రైనేజీలు పొంగి రోడ్డుపై వరదనీరు ప్రవహించింది. మంచిర్యాల చౌరస్తా నుంచి ఖానాపూర్ వెళ్లే రహదారిలో మంత్రి నివాసం సమీపంలోగల ఓ పెట్రోల్ బంక్ వద్ద పూర్తిగా వరదనీరు చేరింది. శాంతినగర్ చౌరస్తాలోనూ రోడ్డుపై నీరు నిలువగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నమే చిమ్మచీకట్లు కమ్ముకోగా వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లారు. మరో రెండ్రోజులు భారీవర్ష సూచన ఉండగా అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఖానాపూర్ మండలంలో..

ఖానాపూర్: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని హైటెక్ సిటీలో గల మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌కు వెళ్లే దారిలోని వాగుపై గల తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. అటుగా వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు.

కుంటాల మండలంలో..

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కుంటాల మండల కేంద్రం నుంచి ఓలా ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు తెగాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడింది. దీంతో విద్యుత్ సిబ్బంది మరమ్మతు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. 37.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్వో సాయన్న తెలిపారు.



గొల్లపేట్‌లో ఇంట్లోకి చేరిన నీటిని తోడుతున్న బాధితుడు



డాక్టర్స్ లేన్‌లో ప్రధాన రోడ్డుపై నీరు



ఖానాపూర్: తాత్కాలిక రోడ్డు పైనుంచి వెళ్తున్న నీరు

'ముదిరాజ్‌లు ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి'



ఐక్యత చాటుతున్న ముదిరాజ్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ముదిరాజ్ కులస్తులు తెలంగాణ ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధంగా ఉండాలని జిల్లా ముదిరాజ్ ఐక్య కార్యాచరణ సమితి నిర్ణయించింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన ముదిరాజ్‌లకు రాజకీయ అవకాశాలు కల్పించకుండా, ప్రభుత్వ పథకాల్లో సముచిత స్థానం ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో 65 లక్షల జనాభా ఉన్నా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి ముదిరాజ్‌లంతా ఏకం కావాలని, జిల్లా కేంద్రంలో త్వరలో నిర్వహించనున్న భారీ బహిరంగసభకు అందరూ తరలిరావాలని కోరారు. జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలు రద్దు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు దర్శనం దేవేందర్ ముదిరాజ్, యాటకారి సాయన్న ముదిరాజ్, సుంకరి పోతన ముదిరాజ్, అనిల్, కిష్టయ్య ముదిరాజ్, పాతాళ గణేశ్, సుంకరి సాయి, చరణ్, రామ్‌దాస్, శేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు



అవార్డు అందుకుంటున్న కిషన్

ఖానాపూర్: నల్గొండకు చెందిన పుడమి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అందజేసిన 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని' మండలంలోని పాత ఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వి.కిషన్ అందుకున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో భక్త రామదాసు వారసుడు శ్రీనివాసరావు తదితర ప్రముఖుల చేతుల మీదుగా అవార్డును అందజేశారు. కార్యక్రమంలో పుడమి సాహితీ సంస్థ ఫౌండర్ బాల్‌రెడ్డి ఉన్నారు.

సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న డాక్టర్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన క్లోం భూమారెడ్డి ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ క్లోం వెంకట్‌రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు 50 సైకిళ్లను ఆయన సతీమణి డాక్టర్ క్లోం జీవిత వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి జన్మదినం సందర్భంగా పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపాడు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు క్లోం జయ శ్రీ, భూమారెడ్డి, వైద్యులు, విద్యార్థులు ఉన్నారు.

జీవోకు చట్టబద్ధత కల్పించాలి

ఉట్నూర్‌రూరల్: జీవో నంబర్.3కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఆదివారం ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో ఆదివాసీ గిరిజన ఉపాధ్యాయ సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రాథోడ్ గణేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో జీవో నంబర్ 3 ప్రకారం స్థానిక గిరిజనులకు అవకాశం కల్పించాలన్నారు. నాయకుల జగన్నాథ్‌రావు, టీపీటీఎఫ్ నాయకులు వెడ్మ శ్యాంరావు, హెచ్‌డబ్ల్యూవో సంఘ ప్రధాన కార్యదర్శి అమిత్ చౌహాన్, రవీందర్, రామారావు, కృష్ణ, కైలాస్, వామన్‌రావు ఉన్నారు.

నిందితుల రిమాండ్

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన గొంద్ర సంజయ్ టాటా ఏస్ వాహనం, రాంపూర్ గ్రామానికి చెందిన చిన్నోల్ల నర్సయ్య ట్రాక్టర్ కల్టివేటర్లను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆదివారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం నర్సాపూర్(జి) బస్టాండ్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇరువురిని పట్టుకుని విచారించారు. చాక్‌పల్లి గ్రామానికి చెందిన కరెండ్‌వార్ గణేష్, వానల్‌పాడ్ గ్రామానికి చెందిన జాదవ్ బాలాజీ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించి వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్: 9640468899, 9640258899 [H-189329]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

కొలామి భాషకు అక్షర సేద్యం


Wp/nit/జవహర్ లాల్ నెహ్రూ

కొలామి వికీపీడియాలో నెహ్రూ సమాచారం


Wp/nit/సాయిఖోమ్ మీరాబాయి చాను

కొలామి వికీపీడియాలో మీరాబాయి చాను సమాచారం

- అంతరించకుండా యువత కృషి
- వికీపీడియాలో కొలామి భాష
- సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు..
- భాష సంరక్షణకు పాట్లు

ఉట్నూర్‌రూరల్: ఆధునిక కాలంలో కాలానుగుణంగా తమ భాష, సంస్కృతి ఎక్కడ కనుమరుగవుతుందేమోనన్న తపనతో ఆదివాసీ కొలాం తెగ యువత ముందడుగు వేసింది. కొలామి భాష, తమ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఆలోచనతో వికీపీడియాను వేదికగా ఎంచుకున్నారు. భవిష్యత్ తరాలకు తమ భాష, సంస్కృతి, పదజాలం, జానపద పాటలు, నృత్య కళారూపాలు, చారిత్రాత్మక అస్తిత్వ పరిరక్షణకు తమ వంతు పాత్ర పోషిస్తూ తెలుగు లిపితో కొలాం భాషను వికీపీడియాలో పొందుపరుస్తూ.. పలువురు మన్ననలు పొందుతూ కొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఇది వరకే ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఐటీడీఏ పీవో పాల్గొని కొలామి భాషను వికీపీడియా ద్వారా ప్రపంచానికి తెలియచేయడంపై ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి బోలిచేతో (భాష చైతన్యం) ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికీపీడియా శిక్షణ తరగతులు

కొలాం తెగకు చెందిన యువకులు, కళాకారులు తమ నైపుణ్యాన్ని వెలికితీసి భాషను నేరుగా వికీపీడియాలోకి మార్చి తమ ఔనత్యాన్ని చాటుతున్నారు. కొలామి భాషతో పాటు మహానీయులు, క్రీడాకారులు, రాజకీయ నాయకుల చరిత్రను కొలామిలో పొందుపర్చేందుకు సిద్ధమవుతున్నారు.

ఆదివాసీల్లో అత్యంత వెనుకబడిన తెగ...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 46,677 మంది కొలాం జనాభా ఉన్నారు. ఆదివాసీ తెగల్లో అత్యంత వెనుకబడిన తెగ ఆదివాసీ కొలాం. వారి సంస్కృతి, సంప్రదాయాలకు భిన్నంగా ఉంటాయి.

కొలాం సంస్కృతి

గిరిజన తెగల్లో కొలాం సంస్కృతి, ఆచార వ్యవహారాలు భిన్నంగా ఉంటాయి. కొలాం ఆదివాసీలు కొలిసే ఆరాధ్యదైవం భీమయ్యక్, నడిదమ్ము, ముత్తేలమ్మ, దండారీ, దూరడి, పాలకమ్మ దేవతలు ముఖ్యమైనవి. వివాహ వేడుకల్లో పాడే జానపదులు ప్రత్యేకంగా ఉంటాయి. కొలాం మహిళలు, పురుషులు ఉత్సవాల సందర్భంగా కొలామి మాతృభాషలో పాడే పాటలు, నృత్య కళారూపాలను కాలానుగుణంగా వివిధ ఉత్సవాలకు సంబంధించిన నృత్యాలు సేకరించి పొందుపర్చనున్నారు.



మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయి (ఫైల్)



ఫౌండేషన్, వికీపీడియా సభ్యులు

వికీపీడియాలోకి..

KOLAMI WIKIPEDIA

తెలుగు లిపిని అలంబన చేస్తూ కొలామి భాషకు జీవం పోసి వందలాది వ్యాసాలతో ముందుకు సాగుతూ అంతర్జాతీయ వేదికగా నిర్మితమవుతున్న కొలామి వికీపీడియా అక్షర సేద్యంగా నిలువనుంది. కొలాం తెగ ప్రజలు రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, మహారాష్ట్రలో యావత్మల్ జిల్లాలో నివసిస్తున్నారు. వీరిది ద్రావిడ భాష అయినా కొలామి భాషను మాట్లాడతారు. ప్రభుత్వ రికార్డుల్లో కొలామ్స్ అని నమోదు చేసింది.

కొలామి వికీపీడియా ప్రస్థానం

కొలామి వికీపీడియాను జూన్ 28న నేతి సాయికిరణ్ ప్రారంభించారు. ప్రపంచంలో లిపి లేని ఆదివాసీ భాషలు రోజురోజుకూ అంతరించిపోతున్నాయి. భాష పదజాలం కోసం సంస్కృతి పరిరక్షణకు బోలిచేతో ఫౌండేషన్ స్థాపించారు సాయికిరణ్. భాష కోసం, ఆదివాసీలు సంస్కృతిక పంటలైన చిరుధాన్యాల బాహ్య ప్రపంచానికి తెలియచేసేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

భవిష్యత్‌కు కొలామి వికీపీడియా అవసరం



తెలుగు వికీపీడియాలోని తెలంగాణలోని జిల్లాలు, మండలాలు, గ్రామాలకు సంబంధించిన సమాచారాన్ని కొలామి భాషలో అనువాదం చేస్తున్నాం. సమకాలిన అంశాలపై రచనలు కొనసాగుతున్నాయి. వికీబుక్స్‌లో నేను రచించిన కొలాం వీరుడు కుమురం సూరు, దండారీ కైతికాలు, దంతన్‌పల్లి భీమయ్యక్ మహాత్మ్యం, మోతీరాము శతకం పుస్తకాలు పొందుపర్చుతాను.

– ఆత్రం మోతీరాం, కొలామి వికీపీడియా, కవి

మా జీవన విధానాన్ని వికీలో భద్రపరుస్తాం



మా కొలాం సంస్కృతికి సంబంధించిన వ్యవహారాలు, దేవళ్లు, జానపద నృత్యాలు, పాటలు, మా చారిత్రాత్మక స్థానాలు, మా జీవన విధానం, పల్లెలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సేకరించి వికీ కామన్స్‌లో భద్రపరుస్తాను.

ఆత్రం రాజ్‌కుమార్, కొలామి వికీపీడియా

ఇష్టంతో అనువాదం



తెలుగు వికీపీడియాలోని సమాచారాన్ని కొలామి భాషలో అనువాదం చేయడం నాకెంతో ఇష్టం. జాతీయ నాయకులకు సంబంధించిన సమాచారాన్ని కొలామి భాషలో తెలుగు లిపితో అనువాదం చేస్తున్నాం. మా మాతృభాష కొలామి భాషకు సేవా చేయడం నాకెంతో గర్వకారణం.

– మడావి జంగు, కొలామి వికీపీడియా

అంతరిస్తున్న భాషలపై పరిశోధన



యునెస్కో ప్రకారం ప్రపంచంలో 7వేలకు పైగా భాషలు వాడుకలో ఉన్నాయి. ఈ జాబితాలోని చాలా భాషలు అంతరిస్తున్నాయి. వైవిధ్యంగా ఉన్న భాషలు ప్రపంచ భాష వైవిధ్యతను కోల్పోయే దిశలో ఉన్నాయి. భాషను డిజిటల్ మాధ్యమాల ద్వారా పునరుద్ధరణ చేయడమే నా లక్ష్యం.

– నేతి సాయికిరణ్, తెలుగు వికీపీడియా, బోలిచేతో ఫౌండేషన్, వ్యవస్థాపకుడు, అస్సాం

మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం మహాసభను విజయవంతం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం ద్వితీయ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గుమ్ముల అశోక్ అన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లు ఆదివారం స్థానిక విశ్రాంతి భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ అధ్యక్షతన మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ద్వితీయ మహాసభ సమావేశాలు ఈనెల 6వ తేదీన బుధవారం సికింద్రాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులను విస్మరిస్తుందని ఇప్పటి వరకు కొన్ని జిల్లాల్లో కనీసం గుర్తింపు కోసం అక్రిడేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు కూడా ఇవ్వడం లేదన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధనకై నిర్మల్ జిల్లాలోని అన్ని మండలాల్లోని మున్నూరుకాపు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అందరు హాజరై విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్లీనరీ సమావేశాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి వర్యులు గంగుల కమలాకర్, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు బండి సంజయ్, పొన్నాల లక్ష్మయ్య హాజరు అవుతారన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు ద్యావరశెట్టి మధు, జిల్లా కార్యదర్శి పెంట రంజిత్ కుమార్, సంతోష్, తాడిచెట్ల మధుకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం జిల్లా నాయకులు

రవీంద్రభారతిలో స్వామి లఘుచిత్రాల ప్రదర్శన

తాంసి: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జిల్లా నుంచి ఎంపికైనా పల్లె లఘు చిత్రాలను శనివారం రాత్రి ప్రదర్శించారు. రవీంద్రభారతిలోని పైడి జైరాజ్ థియేటర్‌లో ప్రదర్శనకు ఆదిలాబాద్ జిల్లా నుంచి మొదటగా మొత్తం 35లఘు చిత్రాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన చిత్రాలను సెప్టెంబర్‌లో ప్రతీ శనివారం రాత్రి ప్రదర్శించనున్నారు. శనివారం తాంసి మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన కర్నేవార్ స్వామి చిత్రీకరించిన సర్పంచ్ మొగుడు తోపు, కొంప ముంచిన కరోనా, ఆన్‌లైన్ క్లాసుల గోల లఘు చిత్రాలను ప్రదర్శించారు. థియేటర్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ లఘు చిత్రాలను నిర్మించిన వారితో కలిసి తిలకించి అభినందించారు. అనంతరం వేదికపై స్వామిని మామిడి హరికృష్ణ, నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రమేష్ కిషన్ గౌడ్, రత్నాకర్ తదితరులు ఉన్నారు.



స్వామిని సన్మానిస్తున్న తెలంగాణ భాషా సాంస్కృతిక సంచాలకులు హరికృష్ణ

విద్యుత్‌వైర్లు తగిలి తాపీమేస్త్రి మృతి



శేఖర్ (ఫైల్)

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామంలో ఓ ఇంటిని నిర్మిస్తుండగా తాపీ మేస్త్రి కొలిపాక శేఖర్(33) 33కేవీ వైర్లు తగిలి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రాము వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలోని ధని గ్రామానికి చెందిన శేఖర్ బోథ్ మండలంలోని పొచ్చర గ్రామంలో రమేష్ ఇంటి నిర్మాణానికి మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో స్లాబ్‌పై ఉన్న 33కేవీ వైర్లు తాపీకి తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే పడి మృతిచెందాడు. గమనించిన తోటి మేస్త్రిలు సీపీఆర్ చేసినా ఫలితం కానరాలేదు. వెంటనే బోథ్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

సిరికొండ: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... జింక నడ్పి మల్లేష్, ధనలక్ష్మి కుమారుడు జింక శ్రీకాంత్(19) శనివారం ఉదయం పంట పొలంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన తండ్రి స్థానికుల సాయంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మానసికస్థితి సరిగా లేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృత్యుమార్గం.. 44 హైవే

- కుటుంబంతో వస్తుండగా గుంతలో పడిన బైక్
- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని భర్త మృతి
- భార్య, పిల్లలకు గాయాలు
- ప్రయాణంలో ప్రాణాలు కోల్పోతున్న ప్రయాణికులు
- నిర్మాణ లోపాలే కారణమంటున్న స్థానికులు



సుఖాచారి మృతదేహం

సుఖాచారి (ఫైల్)



కొడుకు మృతితో రోదిస్తున్న రుక్మిణిబాయి

గుడిహత్నూర్: 'అయ్యో బేటా.. నేనే మిమ్మల్ని విడిచి వెళ్తామని ఆ దేవున్ని మొక్కుకుంటున్నా.. నన్ను విడిచి ఎలా వెళ్లావురా? ఆ దేవుడికి న్యాయం తెలియదా? ఎంతో కష్టపడి నాకు వైద్యం చేయిస్తున్నావు.. నేను చచ్చేది.. నువ్వెలా చచ్చావురా.? అంటూ ఆ తల్లి రోదిస్తున్న తీరు అందరిని కలిచివేస్తోంది. మండల కేంద్రంలోని హనుమాన్ నగర్‌కు చెందిన సుఖాచారి (52) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇచ్చోడలోని బంధువుల ఇంటికి భార్య నీలాబాయి, ఇద్దరు కూతుళ్లు మహాలక్ష్మి, శివప్రియతో కలిసి మోటార్ సైకిల్‌పై ఆదివారం ఉదయం 11గంటలకు వెళ్లాడు. మధ్యాహ్నం స్వగ్రామానికి బయలుదేరారు. ఆ సమయంలో వర్షం మొదలైంది.

మండలంలోని మన్నూర్, డోంగర్‌గావ్ మధ్యలో పెట్రోల్ పంపు సమీపంలో వర్షపు నీటితో నిండిన గుంతలను తప్పించే క్రమంలో గుంతలో బైక్ పడడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుఖాచారి తలకు తీవ్రగాయం కాగా భార్య నీలాబాయికి, చిన్నారులు శివప్రియ, మహాలక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వీరిని ఓ కారులో రిమ్స్‌కు తరలించారు. అప్పటికే సుఖాచారి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

ఇటీవల జరిగిన సంఘటనలు...

ఇటీవల మండలంలోని జాతీయ రహదారిపై చింతగూడ సమీపంలో తెల్లవారు జామున ఆటోలో ప్రయాణిస్తున్న వారిని లారీ ఢీ కొన్న ప్రమాదంలో జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. అలాగే నిర్మల్ జిల్లాలో గత ఆగస్టు 27న జరిగిన ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల నేరడిగొండ వద్ద జరిగిన ప్రమాదంలో బోథ్ మండలం కన్గుట్టకు చెందిన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఇలా పలువురు మృత్యువాత పడడంతో పాటు గాయాలపాలవుతున్నారు. కానీ హైవే అథారిటీ స్పందించకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. వేగ నియంత్రణ సూచికలు లేకపోవడంతో పాటు హైవే నిర్వహణ సంస్థల నిర్లక్ష్యం వాహనదారులకు శాపంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రాణాలు తీస్తున్న హైవే..

ఇటీవల కురిసిన వర్షాలకు 44హైవేపై ఏర్పడిన గుంతలతో నేరడిగొండ నుంచి ఆదిలాబాద్ వరకు ఏదో ఒక చోట నిత్యం రోడ్డు ప్రమాదాలతో పలువురు ప్రాణాలు కోల్పోతుండగా మరి కొంత మంది గాయాలపాలవుతున్నారు. కాగా గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాలను గుర్తించి జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సదరు కాంట్రాక్టు సంస్థతో చర్చలు జరిపి వెంటనే గుంతలు సరి చేయాలని హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వీరు గత పక్షం రోజుల నుంచి మావల బైపాస్ రోడ్డు నుంచి గుడిహత్నూర్ వైపు గుంతలు పూడ్చే పనులు చేపడుతున్నారు. అయితే పని జరుగుతున్న చోట మాత్రమే ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి పనులు జరుపుతున్నారు. మిగతా చోట్ల ఉన్న గుంతల వద్ద ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయక పోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

మావల: మండలంలోని బూరుగుపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం లారీ బోల్తా పడగా డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. నాగ్‌పూర్ నుంచి బెంగుళూర్‌కు ఆలుగడ్డల లోడుతో వెళ్తున్న లారీ భూరుగుపల్లి సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. గాయపడిన లారీ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అర్లి(కే) ఎక్స్‌రోడ్డు సమీపంలో..

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి(కే) ఎక్స్‌రోడ్డు సమీపంలో లారీ బోల్తాపడగా డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... చెన్నయ్ నుంచి జైపూర్‌కు క్లాత్ బిండల్స్, ట్రాక్టర్‌ను లారీలో తరలిస్తున్న క్రమంలో నర్సాపూర్(జి) మండలంలోని అర్లి(కే) ఎక్స్ రోడ్డు సమీపంలోని 61వ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం 3గంటల ప్రాంతంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి లారీ బోల్తా పడింది.

రెండు బైక్‌లు ఢీ

బోథ్: మండలంలోని సొనాల గ్రామం టీవీటీ క్రాస్ రోడ్డు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉన్న ఓ పెట్రోల్ పంపులో పనిచేస్తున్న అనిల్ సొనాలకు వెళ్తున్నాడు. సాకెర గ్రామానికి చెందిన రాజేందర్ సొనాల నుంచి సాకెర వెళ్తున్న క్రమంలో టీవీటీ క్రాస్ రోడ్డు వద్ద ఎదురెదురుగా ఒక్కసారిగా ఢీకొట్టుకున్నారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బోథ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరిని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు.

వ్యక్తి అదృశ్యం

సారంగపూర్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బోరిగాం గ్రామానికి చెందిన కోంద్ర మహిపాల్‌రెడ్డి(37) కనిపించడం లేదని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. వారి వివరాల ప్రకారం... గత నెల 11వ తేదీన మహిపాల్‌రెడ్డి ఉదయం లేవగానే పంటపొలానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చేసేది లేక పోలీసులకు ఫిర్యాదు చేశారు.